# రాముని దాసు

రామభద్ర రారా అంటూ తామరస లోచనుణ్ణి లాలించి,

ఫాహిరామప్రభో అంటూ వైదేహి రాముణ్ణి రంజింపజేసి,

అంతా రామమయమే ఈ జగమంతా రామమయమే అంటూ, పశుపక్షాదులను సహితం స్పందింపజేసి,

రామ చరణమే మాకు శరణం అంటూ రామునుకి దాసుడైన గోపన్న 1620 లో నేలకొండపల్లి లో లింగన్న మూర్తి రామాంబ దంపతులకు జన్మించారు.

వాగ్గేయకారుల్లో రామ భక్తిచే పునీతుడయ్యి, శ్రీరాముణ్ణి కొలిచి, కీర్తించి, భక్త రామదాసు గా సుప్రసిద్ధుడైనాడు.

తెలుగు లో కీర్తనలకు ఈయన ఆధ్యుడు. దాశరథీ శతకం, ఎన్నో సంకీర్తనలు, భద్రాచల దేవస్థానం, ఇవన్నీ రామదాసు నుండి తెలుగు వారికి సంక్రమించిన పెన్నిధులు.

గోపన్న గురువు గారు శ్రీ రఘునాధ భట్టాచార్యులు.

తారకమంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా అంటూ, కబీర్ దాసు గారు తనకి ఉపదేసించిన తారకమంత్రాన్ని జనులందరికీ ఉపదేసించారు.

తక్కువేమి మనకు, ప్రక్కన రాముడున్నాడంటూ అందరికీ ధైర్యం చెబుతూ,

శ్రీరామ నీనామమేమి రుచి రా అంటూ ద్రాక్షపాకము కంటే తీయని రామనమాన్ని రుచింపజేసి,

నిత్యము రామనామస్మరణ చెసేవారు.

ఇక గోపన్న భద్రాచల ప్రయాణం గురించి చెప్పాలంటే, అది ఒక మహిమాన్విత ఘట్టమే!

గోపన్న మేనమామ మాదన్న అప్పటి గోల్కొండ నవాబు. తానీష గారి కొలువు లో పెద్ద ఉద్యోగులు.

ఆయన సిఫార్సు తో గోపన్నకు పాల్వంచ పరగణ తహసీల్దారు పదవి లభించింది. దున్నేవాడిదే భూమి అంటూ రైతులకి చేయూతనిస్తూ, ప్రజల పాలనా వ్యవహారములు చాలా చక్కగా నిర్వర్తించేవారు.

రామదాసు, కమలమ్మను వివాహం చేసుకుని గ్రుహస్థాశ్రమమును మూడు పువ్వులు, ఆరు కాయలుగా ప్రకాసింపచేశారు.

దమ్మక్క అనే భక్తురాలి కోరిక మేరకు, ఆ భద్ర శైల రాజునికి మందిరాన్ని నిర్మించి, పునరుద్ధరించుటకు అంగీకరించారు.

శ్రీరామ నామము మరువక, గోవిందునే కొలుస్తూ, నారాయణునే నమ్ముతూ, ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
సేకరించిన ధనము సరిపోక తాను వసూలు చేసిన శిస్తు నుండి కొంత ధనమును మందిర నిర్మాణానికి వెచ్చించినారు.
జనులందరినీ, ప్రోత్సహిస్తూ,తన సంకీర్తనలతో నవ నాడులనూ స్పందింపజేస్తూ, రాముని మందిర నిర్మాణాన్ని పూర్తి చేశారు.

కానీ, విధి చెసే వింతలు ఎవరికి ఎరుక!

శిస్తు కట్టలేదని కోపించిన నవాబు గారు గోపన్నకు పన్నెండు సంవత్సరాలు కారాగార శిక్ష విధించారు.
ఉఛ్వాస నిశ్వాసాల్లో శ్రీరాముణ్ణే కొలువు తీర్చుకున్న రామదాసు, రామా! రామా! అంటూ, పంజరములోని రామచిలుకవలె, కారాగ్రుహములో, అనేక శిక్షలతో, దెబ్బలతో చిత్రహింస పడినాడు.
సీతారామ లక్ష్మణ ఆంజనేయుల చిత్రమును చిత్రించుకుని వారిని కీర్తించుచూ తన గాయాలను కుడా లక్ష్యం చేయక,
“నీ పలుకే బంగారమాయె కోదండ పాణి, ఎంత పిలిచినా పలుకవేల” అంటూ శ్రీరామచంద్రుని దర్శన భాగ్యం కొరకు వేయి కన్నులతో ఎదురు చూసినాడు.

ఇక చిత్ర హింసలకు తాళలేక , ఏ తీరుగనైనా నా పై దయ చూపరా ఇనవంశొత్తమా!
క్రూర కర్మములు నేరక చేశాను, ఇక నేరములెంచక, నా దారిద్రమునే పరిహారముగా చేయి రామా అని మొరపెట్టుకున్నాడు.
ఎంత వేడుదు, ఎంతని పాడుదు, నీ దయ చూపవ రామా, నీవంటి అన్యాయ దైవము నెయ్యడ గాననయ్య రామయ్యా అంటూ రాముని కటాక్షము లభించలేదని ఆక్రోషిస్తూ , లక్ష్మణుకి చేయిస్తి ముత్యాల పతకము, సీతమ్మకు చెయిస్తి చింతాకు పతకము, కలికితురాయి నీకు పొలుపుగా చేయిస్తిని , యెవడబ్బ సొమ్మని నీవు కులుకుచూ తిరిగేవు రామచంద్రా అని రామునికి లెక్కలు ఒప్పచెప్పి, మరలా తన రాముణ్ణి నిందించినాడని బాధపడి,
అబ్బా తిట్టితినని ఆయాస పడబోకు రామచంద్రా ఈ దెబ్బలకోర్వలేక తిట్టితినయ్యా  అంటూ తన బాధకి, కోపానికి, కారణము చెప్పి,

రామచంద్రుడు నాపై చలము చెసినాడు, ప్రక్కన చేర్చుక చెక్కిలి నొక్కుచూ చక్కగా మరుకేళి నొక్కి యుండు వేళ, నను బ్రోవమని విభునకి చెప్పవే సీతమ్మ తల్లి అంటూ నిశ్చల ప్రెమకలిగిన అమాయక బాలుని వలె తల్లికి, తన బాధని చెప్పుకున్నాడు.

క్షమాపణ అడగటం లో రాముని పై రామదాసు ప్రేమ వెల్లడీగుచున్నది.

ఆవ్యాజమైన ప్రేమ ఉన్నచొటే, చిరు కోపం కూడా ఉంటుందనటానికి రామదాసు కీర్తనలే నిదర్శనం.

రామదాసుని కర్మ శేషము పరిసమాప్తి కాగానే రామలక్ష్మణులు తానీషా గారి వద్దకు వెళ్ళి ఆరు లక్షల వరహాలు చెల్లించి, రామోజీ లక్ష్మోజీలము మేము , రామానుజమతము వారం, సర్కారు బాకీ పైకం మాచేత పంపగా వచ్చినాము అంటూ రామదాసు విడుదల పత్రం తీసుకున్నారని ప్రతీతి.
ఆప్పుదిచ్చిన నాణెములను రామ టెంకా నాణెములు అనేవారట.

రామదాసు గొప్పతనాన్ని తెలుసుకున్న తానీషా వారు వెంటనే రామాదసుని విడుదల చేయించారట.

శ్రీరముడు సతీ సమేతుడై రామదాసుకు సాక్షాత్కరించి మోక్షాన్ని ప్రసాదించగా, రామనామము కన్న మొక్షమేల అంటూ
మంగళ రామునికి, మహిత గుణ ధామునికి, రాజజా మనోహరాయునికి మహిత మంగళాన్నొసగి,1670 వ సంవత్సరమున శ్రీరాముని లో ఐక్యమైనాడు భక్త రామదాసు.

త్యాగరాజు తన కీర్తనలు "రామచంద్రుని పాద భక్తులకెల్ల వీరుడనన్తగిన వెలసిన శ్రీ రామదాసు వినుతింతు మదిన్" అని వ్రాసిరి.
దీనిని బట్టి రామదాసు ఎంతటి మహిమాన్వితుడో తెలియుచున్నది.
ప్రజలలో శ్రీరామదాసు కీర్తనలు చాలా ప్రచారములోనున్నవి. పండితులూ పామరులూ కూడా ఆ కీర్తనలను భక్తి గా పాడుకొందురు.
రామదాసు కీర్తన ఒక్కటైన రాని ఆంధ్రుడు ఉండడంటే అతిశయొక్తి కాదు
అంతేగాక , కుల మతాలకు అతీతంగా, భద్రాచల సీతారామ కళ్యాణ మహోత్సవ దర్శశ భాగ్యం, జనులందరికీ అందించాలని, ఆరు బైటే జరపాలని రామదాసు చేసిన శాసనం ఇప్పటికీ భద్రాచలం లో అమలుపరుస్తారు.

రాముని గొప్పతనాన్ని, దివ్యత్వాన్ని చాటిచెప్పిన వాగ్గేయకారుడు, తేజోమయుడు ఐన రామదాసుకు

శతకోటి నమస్కారాలు, పాదాభి వందనాలు.

శుశీల దేవి కొర్లిమర్ల,

శ్రీకృతి గెంటేల